ప్రజాశక్తి

సోమవారం 30 డిసెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

మినుము రైతు కుదేలు

- వర్షానికి దెబ్బతిన్న పంట
- నష్టాల బాటలో రైతులు

ప్రజాశక్తి - పిసిపల్లి

వర్షాల కారణంగా పంట దెబ్బతినడంతో మినుము రైతులు కుదేలయ్యారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షపు నీరు కోత దశలో ఉన్న కాయలోకి చేరింది. దీంతో గింజ బూజు పట్టింది.రంగు కూడా మారి చేదుగా తయారైంది. ఏమి చేయాలో అర్థం కాక రైతులు లబోదిబో మంటున్నారు. పిలిపల్లి మండలంలో 2500 ఎకరాల్లో మినుము సాగు చేశారు. ఎకరంలో పంట సాగు చేసేందుకు దుక్కు దున్నేందుకు, గొర్రు దున్ని విత్తేందుకు రూ.4వేల ఖర్చు అయ్యింది. మినుము విత్తనాలు ఎకరాకు 10 కిలోలు రూ.1300 కొనుగోలు చేశారు. ఎరువలు, పురుగు ముందు, చీడపీడలు, తెగులు రాకుండా ఉండేందుకు మరో రూ.9వేలు మేర ఖర్చు చేశారు. మొత్తంగా ఎకరాకు రూ.14 వేల మేర పెట్టుబడి పెట్టారు. గత ఆదివారం నుంచి గురువారం వరకూ కురిసినన వర్షాలకు పంట భారీగా దెబ్బతింది. సుమారు 90 శాతం దిగుబడి తగ్గింది.

కోత కూలి కూడా రాని వైనం

వర్షానికి దెబ్బతినడంతో కోత కూలి కూడా రాదని కొంత మంది మినుము కోయకుండానే చేనేపైనే వదిలేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఐదు మీటర్లు పొలంలో గింజ దిగుబడి ఒకటిన్నర కిలో నుండి రెండు కిలోల మధ్య రావాలి. కనీసం ఒకటిన్నర కిలో దిగుబడి వచ్చినా పెట్టుబడులు వస్తాయి. ఆదాయం రాకపోయినప్పటికీ నష్టపోడు. ఇటీవల కురిసిన వర్షాలకు ఐదు మీటర్లు పొలంలో మినుము పైరు కొస్తే 250 గ్రాములు నుంచి 300 గ్రాముల మేర మాత్రమే దిగుబడి వచ్చింది. కొన్ని పొలాలలో 300 గ్రాములు కూడా రాలేదు. ఏక పంటగా మినుము ఒక్కటే సాగు చేసినా 400 గ్రాములు కూడా రాలేదు. కందిలో అంతర పంటగా సాగు చేసిన పొలాల్లో 250 గ్రాముల దిగుబడి లేదు. ఇలాగైన ఎకరాకు 50 కిలోల మించి దిగుబడి రావటం లేదు. వీటికి తోడు గింజ ఎరుపు రంగులోకి మారి చేదుగా తయారైంది. అందువల్ల ▶ 2లో



కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

గ్రామాల్లో 'బెల్టు' కిక్

- కఠారిపాలెంలో బెల్టు షాపుకు రూ.5 లక్షలు
- వేలంలో దక్కించుకున్న మద్యం సిండికేట్ వ్యాపారి
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికారం అండతో బెల్ట్‌షాపులు వెలిశాయి. రాష్ట ముఖ్యమంత్రి నుంచి జిల్లా కలెక్టర్ వరకూ మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని పదేపదే హెచ్చరిస్తున్నారు. అవేవి ఎక్సైజ్ శాఖ అధికారుల చెవికెక్కడం లేదు.

జనసంచారం ఉండే చోట గ్రామాల్లో అనధికారిక మద్యం బెల్టు షాపులు వెలుస్తున్నాయి. బడ్డి కొట్లు కూడా బెల్టు షాపులుగా మారుతున్నాయి. నూతనంగా మద్యం షాపులు వచ్చాక నెల వారీ మామూళ్ల మొదలయ్యాయి. దీంతో బెల్టు షాపులు ఎక్సైజ్ అధికారులకు కనిపించడం లేదు. మందుబాబుల చేష్టలతో మహిళలు, సామాన్యులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వెలసిన బెల్టు షాపులది ఓ లెక్క అయితే, చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వేటపాలెం మండలం కఠారిపాలెం గ్రామంలో వెలసిన బెల్టు షాపుది మరో లెక్కగా ఉంది. కఠారిపాలెం గ్రామంలో అనాదిగా పలు రకాల కట్టుబాట్లు ఉన్నాయి. చీరాలకు చెందిన మద్యం సిండికేట్ వ్యాపారి వాటిని తనకు అనుకూలంగా మలచుకున్నాడు. అక్కడి వారితో మాట్లాడుకుని వేలం పాట తరహాలో బెల్టుషాపు నిర్వహించుకొనేందుకు తమకు ఎవరు పోటీ రాకుండా ఉండేందుకు రూ. 5 లక్షలు ఇచ్చి ఒప్పందం కుదుర్చుకున్నాడు. గ్రామంలోని ముఖ్య కూడలిలో బెల్టుషాపు ఏర్పాటు చేసి జోరుగా మద్యం విక్రయాలు చేస్తున్నాడు. ఈ షాపులో ఎంఆర్‌పి కన్నా అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.



చీరాల బెల్టు షాపుల రూటే సపరేట్

జిల్లాలో దాదాపు అన్ని చోట్ల అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే బెల్టు షాపుల నిర్వహణ జరుగుతుంది. బాపట్లలో ఎమ్మెల్యే,ఎంపీ వర్గీయుల మధ్య బెల్టు షాపుల విషయమై రగడ నడుస్తోంది. చీరాల మాత్రం అధికారపార్టీ, ప్రతిపక్ష వైసిపి,మాజీ ఎమ్మెల్యేల అనుచరుల మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎమ్మెల్యే అనుచరుల కన్నా మాజీ ఎమ్మెల్యే అనుచరుల పెత్తనమే ఎక్కువగా ఉంది. కఠారిపాలెం గ్రామం మొదటి నుంచి మాజీ ఎమ్మెల్యే కనుసన్నల్లో ఉంది. ఇక్కడ వేలం పాట పాడి బెల్ట్ షాపు పెట్టిన చీరాల సిండికేట్ వ్యాపారికి సదరు మాజీ నేత సహాయ సహకారాలు మెండుగా ఉన్నాయి. దీంతో ఆ గ్రామంలో మరెవరూ పోటీకి రాకుండా బెల్టు షాపు పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లోనూ ఇదే తీరున బెల్ట్ షాపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుంది. చీరాలలో మూడు ముఠాలుగా మద్యం వ్యాపారులు ఉండడంతో ఎక్సైజ్ అధికారులకు కలిసి వచ్చింది. స్థానిక ప్రజాప్రతినిధి లిక్కర్ వ్యవహారాలకు దూరంగా ఉన్నారు.మాజీ ఎమ్మెల్యే నేతృత్వంలో సిండికేట్ ▶ 2లో

అంతా 'ఆన్‌లైన్' లోనే..

- ఆర్థిక అవసరాల కోసం అప్పులు చేస్తున్న యువకులు
- అధిక వడ్డీ చెల్లించాలని వేధింపులు
- విలవిలలాడుతున్న వైనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎలాంటి దస్తావేజులతో పనిలేదు. ప్రాంసరీ నోట్లపై సంతకాలు కూడా అవసరం లేదు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో వివరాలు నమోదు చేస్తే చాలు. చిటికెలో అప్పు చేతికందుతుంది. నగదు అత్యవసరమైన వారికి ఇది చాలా తేలిక. గూగుల్ పే, ఫోన్ పేలో వచ్చిన ప్రకటనలను చూసి, ప్లేస్టోర్‌లో ఆన్‌లైన్ మనీ ఎర్నింగ్ యాప్‌లను గాలించి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. అడిగిన అనుమతులన్నీ ఇచ్చేస్తున్నారు. గుర్తింపు, చిరునామాల కోసం ఆధార్, పాన్ కార్డులను, ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. తరువాత లోన్ యాప్‌ల వలలో ఇరుక్కుని యువకులు విలవిల లాడిపోతున్నారు.

సిబిల్ స్కోర్ కోసం మరికొందరు

అత్యవసర నగదు కోసం కొంతమంది ఆన్‌లైన్ మనీ ఎర్నింగ్ యాప్‌లను వినియోగిస్తుంటే, మరి కొంతమంది సిబిల్ స్కోర్‌ను పెంచుకోవడానికి యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంకు క్రెడిట్ కార్డు ఇవ్వాలన్నా, ఏదైనా వస్తువును ఇఎంఐ పద్ధతిపై కొనాలన్నా సిబిల్ స్కోర్ తప్పనిసరి. చివరికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నా సిబిల్ స్కోర్ ఉండాలి. సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న వారంతా ఈ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. సాధారణంగా సిబిల్ స్కోర్ ప్రతి ఆరు నెలలకోసారి అప్‌డేట్ అవుతుంది. ఆన్‌లైన్ మనీ ఎర్నింగ్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకుంటే తక్కువ రోజుల్లోనే తిరిగి చెల్లించాలి. అంతా అనుకున్నట్టు జరిగితే సిబిల్ స్కోర్ పెరుగుతుంది. తక్కువ మొత్తంలో అప్పు తీసుకుని సిబిల్ స్కోర్‌ను పెంచుకుందామనే ఆలోచనలో చాలామంది ఆన్‌లైన్ మనీ యాప్‌ల చిక్కుల్లో ఇరుక్కుపోతున్నారు. అప్పుడు సిబిల్ స్కోర్ పెంచు కోలేక పోతున్నారు. మరోపక్క ఆన్‌లైన్‌లో అప్పును తీర్చలేకపోతున్నారు.



విలాసాల కోసం విద్యార్థులు..

డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు విలాసాలకు అలవాటు పడుతున్నారు. పార్టీలు, ఎంజాయ్ మెంట్లకు ఆర్థిక అవసరాలు పెరుగుతున్నాయి. ఇళ్లలో తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు ఈ అవసరాలను తీర్చలేకపోతోంది. ఇప్పుడు ప్రతి యువకుడి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటంతో అవసరమైన డబ్బును అప్పుగా తీసుకోవడానికి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇలా తీసుకున్న డబ్బుతో అవసరాలను తీర్చు కుంటున్నారు. ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులు మరో అవసరానికి ఉపయోగించు కుంటున్నారు. ఫలితంగా యాప్‌ల ద్వారా తీసుకున్న మొత్తాలకు ఇఎంఐలు చెల్లించేక పోతున్నారు.

వడ్డీతో సహా చెల్లించాలని వేధింపులు..

వడ్డీకి అడ్డూ అదుపు లేకుండా ఉంటుంది. రూ.7 వేలు తీసుకున్న బాధితుడికి పది రోజుల్లోనే రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తారు. అసలు కన్నా వడ్డీ దాదాపుగా రెట్టింపు వసూలు చేస్తారు. వాస్తవానికి జాతీయ బ్యాంకులతో పాటు ఇతర కార్పొరేట్ బ్యాంకులు సిబిల్ స్కోర్‌ను బట్టి 8 శాతం నుంచి 14 శాతం వడ్డీతో ▶ 2లో



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి

హాస్టళ్ల అభివృద్ధికి కృషి

- సమస్యల పరిష్కారానికి చర్యలు
- మెనూలోనూ మార్పులు
- మంత్రి డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

హాస్టళ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ వాలంటీర్ల, వయోవద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శింగరాయకొండలోని బాలుర, బాలికల కళాశాలల హాస్టళ్లు, బీసీ బాలుర హాస్టల్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత కళాశాల బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలను పరిశీలించారు. స్నానపు గదులు, మరుగుదొడ్ల మరమ్మతులకు గురికావటాన్ని పరిశీలించారు. వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మెనూలో మార్పులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వారానికి రెండు రోజులు చికెన్ పెడుతున్నారని, మరో రోజూ పెట్టాలని విద్యార్థులు కోరారు. మూడో రోజు కూడా చికెన్ పెట్టాలని మంత్రి వార్డెన్‌కు సూచించారు. చికెన్ కంటే చాప కూడా మంచిదని, చాప కూడా పెట్టే ప్రయత్నం చేయాలని సూచించారు, కళాశాల బాలుర ▶ 2లో

హాస్టళ్ల అభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

హాస్టలు నుంచి ఎస్‌సి బాలుర్ హాస్టల్‌ను మార్చాలని జిల్లా అధికారులకు సూచించారు. అనంతరం బీసీ బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ గురించి అడిగి తెలుసు కున్నారు హాస్టల్‌లోని వసతుల గురించి అడిగి తెలుసుకొని సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షం పడ్డప్పుడు హాస్టల్ ఆవరంలో నీరు నిలబడ కుండా బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బాలికల కళాశాల హాస్టల్‌ను పరిశీలించారు. అనం తరం విద్యార్థినులతో మంత్రి సమావేశ మయ్యారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి మంచి మార్కులు సాధిం చాలన్నారు. హాస్టల్‌లో నెల్లూరు ప్రకాశం, బాపట్ల జిల్లాలో చెందిన విద్యార్థులు చదువుతున్నారని. వారికి అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హాస్టళ్ల అభివద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి హాస్టలోనూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మెనూలోనూ భారీ మార్పులు తీసు కొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. హాస్టళ్లల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను అభివద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. హాస్టల్ భవనాల మరమ్మతుల కోసం రూ. 143 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రూ.206 కోట్ల 62 నూతన హాస్టళ్ల భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు ప్రతి హాస్టల్‌లో డాక్టర్ ఉండేవిధంగా జిల్లావ్యాప్తంగా ఓ డాక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి హాస్టల్‌నూ ఆరోగ్య కిట్లు అందుబాటులో ఉండేలా చేస్తామని తెలిపారు. హాస్టళ్లల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఇబ్బందులు లేకుండా అక్కడ వసతులు ఉండే విధంగా కషి చేస్తున్నామన్నారు. మంత్రి వెంట డిఇ జగన్, వార్డెన్ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, షేక్ సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, కనిగిరి వెంకటేశ్వర్లు, పులి ప్రసాద్, షేక్ యస్‌ధాని. సుదర్శి ప్రసాద్‌రావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతు కుదేలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారస్తులు వీటిని కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఎకరం పొలంలో కోతకు పదిమంది మహిళలు, నలుగురు మగవాళ్లు అవసరం. ఒక్కో మహిళలకు రోజుకి రూ.400 చెల్లించాలి. మగవారికి రూ.800 చెల్లించాలి. వీరు రోజు ఎకరం మేర పంట కోస్తారు. అందుకు రూ.7,200 ఖర్చు అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంట కోయిస్తే కూలీలకు కూడా సరిపడే పరిస్థితి లేదు. దీంతో ఎక్కువ మంది పంటలను వదిలేశారు.

పంటను పరిశీలించిన అధికారులు

వ్యవసాయ అధికారులు మండలంలోని రామ గోవిందపురం గ్రామ రైతులు సాగు చేసిన మినుము పంటను ఆదివారం పరిశీలించారు. రైతు నారపరెడ్డి మాలకొండయ్య పొలంలో మినుము పంట కోత ప్రయోగం చేశారు. ఐదు మీటర్ల పొలంలో పంట కోయగా కేవలం 300 గ్రాములు గింజలు వచ్చాయి. ఈ లెక్కన ఎకరానికి 40 కిలోల నుంచి 50 కిలోల మధ్యలోనే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మినుములు ప్రస్తుతం కిలో రూ.65 మించి ధర పలకడం లేదు. దీనికి గింజ రంగు మారటం, చేదు మారడంలో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు.

20 ఎకరాల్లో పంట నష్టపోయా..

నూకతోటి మల్లికార్జునరావు, దివాకరపురం



20ఎకరాల్లో మినుము, కంది, బొబ్బర్లు సాగు చేశా. రూ.2 లక్షలపై పెట్టుబడి అయ్యింది. కొంత పొలంలో మినుము, మరికొంత పొలంలో కంది, బొబ్బర్లు సాగు చేశాడు. గతవారం కురిసిన వర్షానికి మినుపకాయలోకి నీరు చేరి పైరు మొత్తం దెబ్బ తిన్నది. పంట కోయాలా? పొలం మీద వదిలేయాలా అనే విషయం అర్థం కావడం లేదు.

ఎమ్మెల్యేకు సత్కారం

ప్రజాశక్తి-గిద్దలూరు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యాదవ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా యాదవ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన మొర్రి పిచ్చయ్యను ఎమ్మెల్యే ముత్తుముల శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఓబిలిబోయిన వెంకటయ్య, బూనబోయిన చంద్రశేఖర్, బోనేని వెంకటేశ్వర్లు, దేమా శ్రీరాములు, యాదవ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అంతా 'ఆన్‌లైన్'లోనే

(మొదటిపేజీ తరువాయి)

లోన్‌ను అందిస్తాయి. పక్కాగా ఇఎంఐ చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది కూడా ఉండదు. వాటిని కాదని ఒక్కసారి ఈ రుణ యాప్ ముగ్గులోకి దిగితే మాత్రం బయటపడటం కష్టమే.

ఇబ్బంది పడుతున్న యువత..

లోన్ మంజూరు చేసే సమయంలో యాప్‌లో నమోదు ప్రారంభించగానే ఫోన్ సమాచారం అంటే కాంటాక్ట్ లిస్ట్, చిత్రాలు వాళ్ల ఆధీనంలోకి వెళ్తాయి. వారడిగినట్లుగా డబ్బు చెల్లించకపోతే మొదట బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి లోన్ చెల్లించడం లేదని చెబుతారు. రెండోసారి లోన్ తీసుకున్న వ్యక్తి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి అతడికి వాట్సాప్ చేస్తారు. ఫోన్‌లోని ఇతర ఫొటోలను మార్ఫింగ్ చేస్తామని బెదిరిస్తారు. సెల్‌ఫోన్‌లో ఉన్న మహిళల నెంబర్లకు అశ్లీల చిత్రాలను పంపిస్తామని హెచ్చరిస్తుంటారు. అసలు తీసుకున్న లోన్‌తో సంబంధం లేకుండా వాళ్లడిగినంత ఇచ్చినప్పటికీ ఇంకా కావాలని వేధిస్తారు. ఫోన్ ముట్టడానికే భయపడే విధంగా మాటల దాడిని పెంచుతారు. చివరకు జీవితంపై విరక్తి వచ్చే విధంగా చేస్తారు.

సులభం అనుకుంటే చిక్కుకున్నట్టే..

ఆన్‌లైన్ మనీ ఎర్నింగ్ యాప్‌ల సంఖ్య బాగా పెరిగింది. చాలామంది సులువుగా అప్పు వస్తుందనుకుంటున్నారు. ఒకసారి ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని అన్ని వివరాలు ఇచ్చారంటే వారికి దొరికిపోయినట్టే. ఇలాంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసి ఆయా సంస్థలకు ఇచ్చినట్లైతే జీవితాలు వారి వలలో చిక్కుకున్నట్టే.

స్వీయ జాగ్రత్తలే శ్రీరామరక్ష

సిహెచ్ ప్రభాకరరావు, సిఐ, యర్రగొండపాలెం



ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్‌లో అనవసరమైన లింక్‌లపై క్లిక్ చేసి మోస పోవద్దు. ఎంతటి ఆర్థిక అవసరమైనా యాప్‌లలో లోన్ తీసుకోకూడదు. తల్లిదండ్రులకు తెలియకుండా యాప్‌ల రుణాలను ఆశ్రయిస్తున్న యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఒకవేళ లోన్ యాప్‌లో ఇప్పటికే తీసుకున్న బాధితులు ఉంటే ఈ వ్యథ నుంచి తప్పించుకునేందుకు 1930 సహాయక నంబరుకు ఫిర్యాదు చేయాలి. వారిచ్చే సూచనలతో సంబంధిత పోలీసులను సంప్రదించాలి.

గ్రామాల్లో 'బెల్టు' కిక్

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారి నియోజకవర్గంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలు, మాజీ నేతకు పట్టు ఉన్న ప్రాంతాల్లోనూ బెల్టు షాపులు గుట్టు చప్పుడు కాకుండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం తమతో కలసి వచ్చే మద్యం వ్యాపారుల నుంచి నగదు వసూలు చేసి ఎక్సైజ్ అధికారులు తమ బెల్ట్ షాపుల జోలికి రాకుండా మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. మాముళ్లు ముడుతున్న కారణంగానే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

అధిక ధరలకు విక్రయాలు

పట్టణ, మండల కేంద్రాల్లోని మద్యం షాపుల్లో ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయిస్తున్నారు. బెల్టు షాపుల్లో మాత్రం అధిక ధరలకు విక్రయించి మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ 20, ఆఫ్ బాటిల్‌పై రూ.40, ఫుల్ బాటిల్‌పై రూ.80 అధికంగా వసూలు చేస్తున్నారు.

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో బెల్టు షాపుల నిర్వాహకులది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది. అధిక ధరలకు మద్యం విక్రయించి అందిన కాడకి దోచుకుంటున్నారు. మద్యాన్ని కల్తీ చేసి మరి విక్రయిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపాలని ప్రభుత్వం ఆదేశాలిస్తున్నప్పటికీ నెలవారి మామూళ్ల కారణంగా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. గోవా మద్యం, నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు చేసి కొందరిని అరెస్టు చేశారు. బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అయినప్పటికీ బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని బెల్టు షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర ప్రదేశంలో అడ్డదారి మూసివేత

ప్రజాశక్తి-మద్దిపాడు



మూసివేసిన అడ్డదారిన పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామయ్య

ప్రమాదకర ప్రదేశాలలో అడ్డదారి మూసివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడు-వెంకటరాజుపాలెం వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను తొలగించి పాదచారులు రోడ్డు దాటుతున్న ప్రదేశాలను కాంక్రీట్ సిమెంట్‌తో మూసివేసినట్లు తెలిపారు. ఇలాంటి ప్రమాదకర ప్రదేశాల వద్ద రోడ్డు దాటే క్రమంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలందరూ జాతీయ రహదారిపై రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని దాటాలని ఎస్ఐ శివరామయ్య సూచించారు. ఎస్ఐ వెంట సిబ్బంది ఉన్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 301/2019

Between :

నాగినేని సుబ్బాయమ్మ వగైరాలు ..... వాదులు

Vs

నాగినేని లక్ష్మయ్య మరియు ఇతరులు.. ప్రతివాదులు

To

D3). అన్నా బత్తిన నాగేంద్రం W/o యోగేశ్వరరావు R/o మంగమూరు రోడ్డు, ఆశ్రమం సెంటర్, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా, ఒంగోలు డి.ఎం.సి (3వ ప్రతివాది)

D6) నాగినేని అమరేశ్వరి W/o శేషగిరిరావు, టీచర్, నిర్మల్ నగర్, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా, ఒంగోలు డి.ఎం.సి (6వ ప్రతివాది)

పై నంబరు దావాను వాది దావా పరిహారములు పొందు నిమిత్తము దాఖలు చేసి ఉన్నారు. దావాలో మూడవ ప్రతివాది, ఆరవ ప్రతివాది అయిన మీరు ఇందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు I.A. No: 3527/2019 నంబరున ORDER 39 RULE 1 and 2 and Sections 94 and 151 C.P.C ప్రకారం దాఖలు చేసిన టెంపరరీ ఇంజక్షన్ పిటిషను లో రెస్పాండెంట్లు 3,6 నెంబర్లుగా చూపబడిన మీకు ఈ విషయమై కూడా ఎన్నిసార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు దావా సమన్లు మరియు పై నంబర్ పిటిషను లో మూడు మరియు ఆరు రెస్పాండెంట్లుగా చూపబడిన మూడు మరియు ఆరు ప్రతివాదులైన మీకు సదరు పిటిషను నందు నోటీసులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 22-01-2025 తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలకముగా తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

అద్దంకి
ఇట్లు

తేది 28-12-2024
పంచాగ్నుల రమేష్
అడ్వకేట్,
అద్దంకి, బాపట్ల జిల్లా
సెల్ నెం 99487 88290

జనరల్ నోటీసు

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, ఒంగోలు వారి కోర్టులో

G..W.O.P. No. 23/2024

1.వేటగిరి రాంబాబు ...పిటిషనర్

And

2.ఆడంగి సుధారాణి ...రెస్పాండెంట్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు కేసును ఈ పిటిషనర్ తన మైనర్ మనుమడు, మనుమరాలు అయిన వేటగిరి రామ్ శ్రవణ్ కుమార్ & వేటగిరి నిహారిక వారి యొక్క ఆస్థికి గార్డియన్‌గా నియ మించమని మరియు వారియొక్క ఆస్థిని వారి తరుపున అమ్ముటకు మరియు వారి తండ్రి గారి డెత్ బెనిఫిట్ను ప్రభుత్వం వారి నుండి తీసుకొనుటకు ఈ పిటిషినరు కు అనుమతి ఇవ్వమని కోరుతూ పై నెంబరు పిటిషను దాఖలు చేయగా శ్రీ కోర్టువారు ఇందును గురించి ఎవరికైన ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల ది. 10-01-2025న ఉదయం గం. 10.30ని.లకు పైన తెల్పిన శ్రీ కోర్టువారి ఎదుట హాజరై తమయొక్క ఆక్షేపణలను శ్రీ కోర్టువారికి తెలుపుకోవలసినదని ఆదేశించినారని తెలియజేయడమైనది.

:: షెడ్యూలు ::

షెడ్యూలు-ఎ

వేటగిరి రామ్ శ్రవణ్ కుమార్ & వేటగిరి నిహారిక అనువారి తండ్రిగారైన లేటు ప్రతాప్కుమార్, హింది పండిట్ గారి యొక్క డెత్ బెనిఫిట్స్ రూ. 13,00,000/- (అక్షరముల పదమూడు లక్షల రూపాయలు) హెడ్మాస్టర్ జెడ్.పి.హైస్కూల్, అంబవరం, చంద్రశేఖరపురం మండలం, ప్రకాశం జిల్లా వారివద్ద నిల్వ ఉన్న నగదు.

షెడ్యూలు-బి

పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుత బాపట్ల జిల్లా, చీరాల స.డి., చీరాల మండలం, ఓల్డ్ జాండ్రపేట (దేవాంగ పురి) గ్రామ పంచాయితి ప్రస్తుత గాంధీనగర్ గ్రామ పంచాయితీ, డోర్ నెం. 7-72, బ్లాక్ నెం. 1, అసెస్మెంట్ నెం. 55, రామక్రిష్ణానగర్, చీరాల విలేజ్ సర్వే నెం. 367/1లోని 150 చ.గ.లు లేదా 125.41 చ.మీ.ల స్థలములోని 800 చ.అ.ల విస్తీర్ణంలో నిర్మించిన ఆర్.సి.సి. డాబా ఇల్లు, సదరు ఇంటికి బిగించిన యావత్తు దర్వాజాలు, కిటికీలు మరియు కరెంట్ కనెక్షన్ నెం.4015, అన్నిఈజ్మెంట్ హక్కులతో సహా ఆస్తికి హద్దులు.

తూర్పు : సదరు ఆస్తికి కాంపౌండ్వాల్ వెలుపల ఉన్న బజారు అ. 29-07లు

దక్షిణం : భోగనాదం సుబ్రహ్మణ్యం స్థలం గారి స్థలం అ. 46-06 లు

పడమర : సదరు ఆస్తికి కాంపౌండ్వాల్ వెలుపల షేక్ కాలేషా మరియు ఇతరులు అ. 29-00లు.

ఉత్తరం : గవిని శ్రీనివాసరావు గారి ఆస్తి హద్దు అ. 46-06లు

ఇట్లు
ఆర్.వెంకటేశ్వరరెడ్డి,
అడ్వకేట్ చీరాల

టెండరు ప్రకటన

బాపట్ల జిల్లా, కొరశపాడు మండలం, రాచపూడి గ్రామం నందు గల ఊర చెరువు నకు ఈ క్రింద తెలిపిన పనులకు గాను రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను టెండర్ షెడ్యూల్సును ది 30-12-2024 నుండి 16-01-2025 సాయంత్రం గం 4-00 లు వరకు శ్రీవేణుగోపాల స్వామి వారి దేవాలయము నందు పొందవచ్చును. టెండరు దరఖాస్తు తో పాటు టెండరు ధరా వత్తు పైకము డిడి గాని, నగదు గాని చెల్లించి రసీదును పొంది ఇందుతో జత పరచవలెను. పూర్తిచేసిన టెండర్లు 17-01-2025 న ఉదయం గం 10-00ల వరకు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం గం 4-00 లకు సీల్డ్ టెండర్లను కార్యనిర్వాహణాధికారి మరియు ఏ ఈ వారిచే తెరవబడును. పూర్తి వివరములు కొరకు శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం నందు పని దినములలో సంప్రదించగలరు.

పనిపేరు	అంచనా విలువ	టెండర్ ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు	పని పూర్తి చేయు కాలము
1.జంగిల్ క్లియరెన్స్ కొరకు	రు.2,00,000	రు 5000	రు 1000	1నెల

ఇట్లు
కార్యనిర్వహణాధికారి

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

కరెంటు సర్దుబాటు చార్జీలు తగ్గిస్తాం.. స్మార్ట్ మీటర్లు పెట్టడం నిలిపివేసి ప్రజలపై భారాలు వేయమన్న హామీని కూటమి ప్రభుత్వ నిలబెట్టుకోవాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ అన్నారు. ఆదివారం రేపల్లె పట్టణంలో వ్యాపార సంస్థలకు బిగించిన స్మార్ట్ మీటర్లను పరిశీలించి వాటి వల్ల కలిగే ఇబ్బందులను కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని ప్రజలకు చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై బాదుడు కార్యక్రమాన్ని మొదలుపెట్టారని విమర్శించారు. సర్దుబాటు చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని అసలు కంటే కొసరు అధికంగా జనంపై పడుతుందన్నారు. అధికారంలోకి రాక మునుపు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేస్తామని చెప్పినటువంటి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే బాటలో నడుస్తున్నారని అన్నారు. గతప్రభుత్వం విద్యుత్ భారాలేయటానికి సిద్ధపడింది కాబట్టే ప్రజలు ఓడించారని, ఇప్పుడు తగ్గించాల్సింది పోయి ఇది గతప్రభుత్వ పాపమే అంటూ విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో సెకితో చేసుకున్న ఒప్పందాలను అప్పట్లో టిడిపి వ్యతిరేకించిన విషయాన్ని ప్రజలందరికీ తెలుసని సౌరవిద్యుత్ ఒప్పందాలలో గత ప్రభుత్వంలో ముఖ్య నాయకుడు అయినటువంటి వ్యక్తికి రూ.1,750 కోట్ల రూపాయల ముడుపులు ముట్టాయని తెలిసిన టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఇదే పరిస్థితుల్లో ప్రభుత్వం తీరు ఉంటే ప్రజలందరినీ కూడగట్టి విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, రమేష్, జె.ధర్మరాజు, జి.దానియేలు, వై.నవీన్, బి.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మణిలాల్



వరి కుప్పను పరిశీలిస్తున్న నాయకులు

అద్దేపల్లిలో వరిగడ్డి దగ్ధం


ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లిలో పీకే నారాయణ స్వామి అనే కౌలు రైతుకు చెందిన వరిగడ్డి కుప్ప దగ్ధమైంది. నారాయణస్వామి భట్టిప్రోలు చెరుకుపల్లి రోడ్డులో ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామంలో నెలకొన్న రాజకీయ కక్షల కారణంగా తన వరి కుప్పకు నిప్పంటించి దగ్ధం చేశారని నారాయణ స్వామి కుటుంబ సభ్యులు ఆరోపించారు. నారాయణస్వామి తెలుగు దేశం పార్టీ కార్యకర్త. ఈ ప్రమాదంలో దాదాపు లక్ష రూపాయలు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. రహదారి వెంట మంటలను గుర్తించిన కొందరు సమాచారం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రేపల్లె అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ కుప్ప పూర్తిగా కాలిపోయింది. గత జూన్ నెలలో అద్దేపల్లి గ్రామంలో జరిగిన వైఎస్సార్ విగ్రహ దగ్దం కేసులో ఉన్న నిందితుల్లో నారాయణస్వామి కూడా ఉన్నారు. దీనికి బదులుగా ఈ వరి కుప్ప దగ్ధం చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వరికుప్ప దగ్ధం చేయటానికి గల కారణాలపై పోలీసులు దృష్టిచారించి విచారిస్తే వాస్తవాలు వెలుగులకు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఘటనలో దగ్ధమైన వరికుప్పను టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి కనపర్తి సుందర్ రావు, వేమూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బట్టు మల్లికార్జున రావు, డీసీ అధ్యక్షులు కరుణ శ్రీనివాస్ రావు, తిరువీధులు బాలాజీ, పోకూరి సురేంద్ర, జంగం సాంసంగ్ పీకే నారాయణస్వామిని పరామర్శించారు. ఈ విషయాన్ని వేమూరు శాసనసభ్యులు ఆనంద్ బాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

కొండపిలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా కొండపి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు, కొండపి మండల రెవెన్యూ కార్యాలయం, మరియు హై స్కూల్‌దాత స్వర్గీయ బూదవాటి సోమయ్యనాయుడు జ్ఞాపకార్థముతో కొండపి నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు దామచర్ల సత్య యూత్ నాయకుడు నేతి రవికుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్ ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా జనవరి 2వ తేదీ నాడు కొండపిలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రత్యేక బహుమతులుగా బెస్టు బ్యాట్స్‌మన్‌కు రూ.5 వేలు, బెస్టు బౌలర్‌కు రూ.5 వేలు, బెస్టు ఫీల్డర్‌కు రూ.5 వేలు, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.5 వేలు కూడా ఇవ్వడం జరుగుతుందని యువ నాయకులు తెలిపారు. ఎంట్రీపీజు రూ.500 చెల్లించి ముందుగా ఎంట్రీ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఎంట్రి ఫీజుకు చివరి తేదీ డిసెంబర్ 30 సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. ప్రతి మ్యాచ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించబడుతుందని, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ కలదని, ఎవరికిట్టు వారే తెచ్చుకోవాలని, ఒక టీమ్‌లో ఆడిన వ్యక్తి మరొక టీమ్‌లో ఆడరాదని, బాలు కమిటీ వారి వద్ద కొనవలెనని, తుదినిర్ణయం కమిటీ వారిదేనన్నారు. వివరాల కొరకు దేపూరి ప్రసన్నాంజనేయులు 8499907863, ప్రసన్న 6304771466, శ్రీను 8008050734, వినయ్ 9866170781 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



ఈశ్వరమ్మకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ మాదాసి వెంకయ్య

ఈశ్వరమ్మకు మాదాసి వెంకయ్య నివాళి

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం మిట్టపాలెంలో ధర్నాసి ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆమె పార్థివదేహానికి కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, పీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటన గ్రామ వైసీపీ నాయకులు మండల మాలకొండయ్య, గ్రామస్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధించగలం

ప్రజాశక్తి-బాపట్ల

ఐక్యతతో ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలపడతామని ప్రముఖ యాంకర్ ఆరే శ్యామల రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శ్యామల కోటిరెడ్డి అధ్యక్షతన రెడ్డి బిజినెస్ గ్రూపు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ రంగాల్లో స్వయంకృషితో ఎదిగి స్థిరపడిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పలువురుని ఒకే వేదిక మీదకు తీసుకురావడం ద్వారా సంబంధాలు మరింత బలపడతాయన్నారు. బిజినెస్ గ్రూపు వ్యవస్థాపకులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ కన్సల్‌టెన్సీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉడుముల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ దేశ విదేశాలలో విద్య అవకాశాల కోసం తన వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ సమావేశంలో వింతా శ్రీనివాసరెడ్డి, అన్నపురెడ్డి రామస్వామి రెడ్డి, ఏనుగు శ్రీనివాసరెడ్డి, నూతన సినీ నటులు శ్రీ హర్ష రెడ్డి, డి.జయ భారత రెడ్డి, కుంచాల భూపతి రెడ్డి, నంగు గోవర్ధన్ రెడ్డి, మున్నం భోగేశ్వర రెడ్డి, కొల్లి శివరామి రెడ్డి, సంజీవరెడ్డి, కోటా రహీం రెడ్డి, పిట్ల శ్రీనివాస్ రెడ్డి, భోగి రెడ్డి రమేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, యన్.నాగార్జునరెడ్డి, సమ్మెట శ్రీనివాస్ రెడ్డి, దొంతిరెడ్డి ఏడుకొండలు, మోదుగుల బసవ పున్నారెడ్డి, చీరాల గోవర్ధన రెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్యామల రెడ్డి

యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

దళిత యువకుడిని కులం పేరుతో దూషించిన యువకుడిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాలు మేరకు.. తిమ్మసముద్రం గ్రామంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గోపతోటి నాగరాజు వర్మకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన నల్లూరి రాజాకు గతంలో ఉన్న పరిచయంలో ఇద్దరి మధ్య నగదు విషయంలో వివాదం ఉంది. ఈనెల 28న తెల్లవారుజామున చీరాల నుంచి ఉప్పుగుండూరు జాతీయ రహదారిపై ఉన్న సుబ్బయ్య హోటల్ వద్దకు వచ్చిన నాగరాజు వర్మ రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తుండగా అక్కడే ఉన్న నల్లూరి రాజా వర్మను కులం పేరుతో దూషించి గాయపరిచాడు. చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరిన నాగరాజు వర్మ అక్కడి ఔట్ పోస్ట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లూరి రాజాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ హెచ్చరించారు. ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక తవ్వుతున్న క్వారీలపై సైతం మైనింగ్ అధికారులు నిఘా పెంచారు. అక్రమంగా ఒక్క ట్రాక్టర్ ఇసుకను తరలించినా చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ కుమార్ తెలిపారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రంగయ్య

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని ప్రకాశం జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రంగయ్య అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ కమిటీ సమావేశంలో రంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ ఆధార్ ఆప్షన్ కల్పించాలని, గ్రేడ్ 1, 2 వీఆర్వోలను డిడిఓలుగా నియమించాలని, అర్హులైన వీఆర్వోలకు ఖాళీలు ఉన్నచోట సీనియర్ అసిస్టెంట్ పోస్టులు వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీ ఉన్న వీఆర్ఏ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, గత మూడు సంవత్సరాలుగా బూత్ లెవల్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి, ఆర్థిక మంత్రి వారిని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశామని, సంఘం చేసిన నిరంతర కృషితో 2021 డిసెంబరు నుంచి మార్చి నెల 2024 వరకు పెండింగ్‌లో ఉన్న బూత్ స్థాయి అధికారుల రెమ్యునరేషన్ సుమారు 63 కోట్లు బడ్జెట్ విడుదల కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖలో ఆమోదం పొందిందన్నారు. అతిత్వరలోనే అన్ని జిల్లాల కలెక్టర్లకు బడ్జెట్ కేటాయిస్తూ సీఈఓ, ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు విడుదల చేయడం జరుగుతుందని, గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ అధికారులు, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులు అరిగెల వెంకటరామయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్, బెంజిమెన్ నల్ల మేకల నాగేంద్రుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్వో రంగయ్య

రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు

ట్రాఫిక్‌తో ప్రజల ఇక్కట్లు

నిరుపయోగంగా రైతు బజారు

దుకాణాలపై ఆసక్తి చూపని వ్యాపారులు

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో ప్రభుత్వం నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మిగిలింది. రైతులు పండించిన ఉత్పత్తులను రైతులే నేరుగా వినియోగదారులకు అమ్ముకునేలా ప్రభుత్వం రైతు బజార్లు ఏర్పాటు చేసి వ్యాపారులకు దుకాణాలు కేటాయించింది. అయితే వ్యాపారులు దుకాణాల పట్ల ఆసక్తి చూపకుండా బయటే రోడ్లపై వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో రైతు బజారులోని దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది.

2014లో టిడిపి హయంలో కూరగాయల మార్కెట్ వద్ద రైతు బజార్ నిర్మించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రారంభానికి నోచుకోక మూలనపడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతిష్టాత్మకంగా బాపట్ల రైతు బజార్ ప్రారంభించారు. అప్పటివరకు బాపట్ల ప్రాంతంలోని సన్న, చిన్నకారు రైతులు పండించిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను రైతు బజార్ ఎదురు సిమెంట్ రోడ్డుపై ఇరువైపులా పెట్టుకొని రైతులు అమ్ముకునేవారు. దీంతో కొనుగోలుదారులకు అక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఆ సమస్యలు నివారించేందుకు రైతు బజార్లో బయట కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునే వారికి షాపులు కేటాయించారు. అయితే లోపల కూరగాయల అమ్మకాలు మూడు రోజులు ముచ్చటగానే మిగిలిపోయింది. రైతులు తిరిగి యథాస్థానంలోనే తమ కూరగాయలు ఆకుకూరలు అమ్ముకుంటున్నారు. దీంతో సమస్య మొదటికి వచ్చింది. అయితే మొదట్లో హడాహుడి చేసిన మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రైతులు ఎప్పటిలాగే బయటే కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకోవడంతో పరిస్థితి తిరిగి యధాతథమైంది. దీంతో రైతు బజార్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇదిలా ఉండగా అక్కడ ఫ్లైఓవర్ కింద కూరగాయలు అమ్మకుండా మునిసిపల్ అధికారులు కంచె వేశారు. అయినప్పటికీ పాత పద్ధతిలోనే మార్కెట్ ఫ్లైఓవర్ కింద రైతులు కూరగాయల వ్యాపారస్తులు తమ వ్యాపారాలను కొనసాగిస్తూనే ఉన్నారు. రైతు బజార్లో షాపులు కేటాయించినప్పటికీ బయటే వ్యాపారాలు కొనసాగించడంతో రైతు బజార్ పూర్తిగా ఖాళీగా దర్శనమిస్తుంది. ఆర్భాటంగా ప్రారంభించిన రైతు బజార్‌తో ప్రయోజనం లేదని ప్రతినిత్యం కూరగాయల మార్కెట్ వచ్చే ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్, మార్కెటింగ్ శాఖ అధికారులు బాపట్ల రైతు బజార్‌పై దృష్టి సారించి వినియోదారులకు రైతులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బండ్లమ్మ సన్నిధిలో జస్టిస్ ఎన్‌వీ రమణ దంపతులు

బండ్లమ్మ ఆలయంలో జస్టిస్ ఎన్‌వి రమణ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బాపట్ల

సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ సతీ సమేతంగా బాపట్ల నియోజకవర్గ పరిధిలో పిట్టలవానిపాలెం మండలం చందోలు బండ్లమ్మ అమ్మవారి దేవస్థానానికి ఆదివారం విచ్చేశారు. ఆలయ మర్యాదలతో ఈవో ఘంటసాల నరసింహమూర్తి ఎన్‌వీ రమణ దంపతులకు స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అఫ్జల్, గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్, చందోలు జనసేన మండల పార్టీ అధ్యక్షులు దాదా, నియోజీ తెలుగుదేశం, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ బాబు

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-వేమూరు

అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామానికి చెందిన వన్నా భూపతిరావు, అమర్తలూరు గ్రామానికి చెందిన ఇంకొల్లు వరలక్ష్మి, చుండూరు మండలం పెనుగుదురుపాడు గ్రామానికి చెందిన మంచాల వెంకటరావు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. చికిత్స కోసం అయిన బిల్‌ని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపించారు. తదుపరి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కు రూపంలో వన్నా భూపతిరావుకు రూ.86,537, ఇంకొల్లు వర లక్ష్మికి రూ.64,634, మంచాల వెంకట రావుకి రూ.15,000 చొప్పున మంజూరయ్యాయి. ఈ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు చేతుల మీదుగా శనివారం అందజేశారు.

నష్టాల బాటలో మినుము రైతు

గణనీయంగా తగ్గనున్న దిగుబడులు

ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



తెగులు సోకిన మినుము పంట

మినుము రైతులు నష్టాల ఊబిలో చిక్కుకుపోయారు. ఓ పక్క వర్షాభావ పరిస్థితులు.. మరోప్రక్క తుఫాన్ ప్రభావంతో దిగుబడి గణనీయంగా తగ్గనుంది. మినుము సాగుకు రైతులు ఈ ఏడాది అధిక పెట్టుబడులు పెట్టారు. మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో మినుము సాగు చేశారు. మంచి పలితాలు వస్తాయని రైతులూ ఆశించారు. పండాకు తెగులు ఆశించడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. దీంతో దిగుబడులు ఘననీయంగా తగ్గే పరిస్థితి నెలకొంది. ఈ పాటికే ఎకరానికి 50 వేల పెట్టుబడి పెట్టారు. దిగుబడి ఎంతవస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తొలుత పంట ఏపుగా ఉండటంతో ఎకరానికి 7 నుంచి 8 బస్తాలు దిగుబడి వస్తుందని ఆశించారు. కానీ వర్షాలు, తెగుళ్లతో రెండు నుంచి మూడు బస్తాలు వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు వాపోతున్నారు.

'జొన్నవిత్తుల'కు సాహితీ పురస్కారం

జనవరి 5న మంత్రి గొట్టిపాటిచే ప్రదానం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-అద్దంకి

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల సాహితీ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పుట్టంరాజు ట్రస్టు అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ప్రకటించారు. జనవరి 5వ తేదీన ఆదివారం ఈయన ట్రస్టు కార్యాలయంలో ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వేదకవి, సినీ గేయ రచయిత, ప్రముఖ కవి మరియు పండితులైన జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకి పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల సాహిత్య పురస్కారం-2025 ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. జొన్నవిత్తుల 24 శతకాలు, 600కు పైగా సినీగీతాలు, 200కు పైగా పేరడీలు, 3000కు పైగా పద్యాలు రచించారన్నారు. తెలుగు భాషా వ్యాప్తి కోసం ప్రపంచవ్యాప్తంగా పర్యటించి ప్రసంగాలు నిర్వహించారని తెలిపారు. తెలుగు భాషా చైతన్యం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ఈ బహుముఖ ప్రజ్ఞావంతునికి పురస్కారం ప్రదానం చేయడం గర్వకారణమని వక్తలు పేర్కొన్నారు. శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం జొన్నవిత్తుల వారి సాహిత్య విశేషాలను పత్రికాముఖంగా వెల్లడించారు. ఈ సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం జనవరి 5, 2025న ఉదయం 10 గంటలకు అద్దంకి వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డివిఎమ్ సత్యనారాయణ రచించిన "వ్యాస మంజూష" పుస్తకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించనున్నారు. ఈ సమాచారాన్ని వారణాసి రఘురామశర్మ వెల్లడించారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో డా. యు. దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడివీరయ్య, చుండూరి మురళీసుధాకరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వివరాల మేరకు శనివారం తెల్లవారుజామున చీరాల వైపు నుంచి 320 బస్తాలతో రేషన్ బియ్యం తరలిస్తున్న డీసీఎం లారీని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ సమీపంలో విజిలెన్స్ సిఐ రాఘవరావు పట్టుకున్నారు. బియ్యం బస్తాలను ఎఫ్‌సిఐ గోడౌనుకు తరలించి లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సదరు లారీతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న పోలీసులు

రేపల్లెలో పోలీసుల శ్రమదానం

ప్రజాశక్తి - రేపల్లె

స్వచ్ఛభారత్ వైపు అడుగుల దిశగా ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు, నిరుపయోగంగా ఉన్న బోర్డులను పట్టణ సిఐ మల్లికార్జునరావు సిబ్బందితో కలిసి తొలగించారు. ఆదివారం రేపల్లె ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో కోర్టు భవనాలు, ఎంపీడీవో కార్యాలయం, తహాశీల్దార్ కార్యాలయం, రేపల్లె పట్టణ, రూరల్ సర్కిల్ కార్యాలయాలు, సబ్ జైలు, ఎక్సైజ్ కార్యాలయాలకు ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రజలు వస్తూ ఉంటారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయ సముదాయాలపై పట్టణ సిఐ మల్లికార్జునరావు దృష్టి సారించారు. రేపల్లె పట్టణ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, నిరుపయోగంగా ఉన్న హెచ్చరిక బోర్డులను, ఆటోలను కార్యాలయ ఆవరణ నుంచి తొలగించి మిగతా ప్రభుత్వ అధికారులకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్క అధికారి బాధ్యత అని సిఐ మల్లికార్జునరావు తెలిపారు.

ఎస్సీ కులాల జాబితాలో తప్పులు సరిచేసుకోవాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జయరాజ్

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

ఎస్సీ వర్గీకరణపై గత ఆగస్టు ఒకటో తేదీన రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానము సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరిచే దిశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కమిషన్ వేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే ప్రక్రియలో భాగంగా గ్రామ సచివాలయాల వీఆర్వోల వద్ద ఎస్సీ కులాల జాబితా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆ జాబితా చూసుకుని, కులం పేరు తప్పుగా నమోదైనచో సరిచేసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఏబీఎం హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఏబీఎం హైస్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హై స్కూల్ ఆవరణలో జరిగింది. ఏబీఎం హైస్కూల్ 1976-77 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. పాఠశాలలో ఆనాటి మధుర స్మృతులను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు ఎలీషా రావు, రష్మీ దంపతులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఐదున్నర దశాబ్దాలకు పైగా చదువులమ్మ చెట్టు నీడను వీడిన పూర్వ విద్యార్థులు అనేక రంగాలలో స్థిరపడి వారి వారి అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
సోమవారం 30 డిసెంబర్ 2024

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

జెవివి సీనియర్ నాయకులు ఎవి.పుల్లారావు



జెవివి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జమిలి ఎన్నికలు సమాఖ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జెవివి సీనియర్ నాయకులు ఎవి.పుల్లారావు తెలిపారు. ఒంగోలు ఎల్‌బిబిజ భవన్‌లో జెవివి జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశం జిల్లా కోశాధికారి బి.తిరుపతయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కమిటీ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం 'జమిలి ఎన్నికలు–దుష్పరిణామాలు' అనే అంశంపై పుల్లారావు మాట్లాడారు. రాష్ట్రాలు, స్థానిక సమస్యల నుంచి ప్రజల దష్టిని మళ్లించేందుకు జమిలి ఎన్నికల పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్ర చేస్తుందన్నారు. విద్యావంతులు, రాజకీయ పార్టీలు, రాష్ట్రాలు 'జమిలి' ని వ్యతిరేకించాలన్నారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు యు. భాస్కర్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా ఒంగోలులో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపు జనవరి 5న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకాశం జిల్లా బాలోత్సవం కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వీరాంజనేయులు, జెవివి జిల్లా గౌరవ సలహాదారులు కె. సుబ్రహ్మణ్యాచారి మాట్లాడుతూ ఒంగోలులో ఫిబ్రవరి 7,8 తేదీల్లో నిర్వహిస్తున్న 'ప్రకాశం బాలోత్సవం–ద్వితీయ పిల్లల పండుగ' ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. జయప్రకాష్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు ప్రస్తుత పోటీ పరీక్షలకు సంబంధించిన నమూనా పరీక్ష జనవరి 30న జెవివి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రయోగాల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందింపజేసేందుకు 'యురేకా సైన్స్ ఎక్స్‌పో వీడియో సైన్స్ ఎక్స్పరిమెంట్ పోటీలు జనవరి 22 వరకూ నిర్వహించనున్నట్లు జెవివి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యాధికారులు,విద్యాసంస్థల యాజమాన్యాలు ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు వి.మాలకొండారెడ్డి, షేక్ బషీరున్నీసా బేగం మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రచురిస్తున్న 'విద్యార్థి చెకుముకి సైన్స్ మాసపత్రిక' విద్యార్థులకు ఎంతోఉపయోగ పడుతుందన్నారు. జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ జెడ్.రమణయ్య మాట్లాడుతూ శాస్త్రీయ దక్పథం పెంపుదలకు, మూఢ నమ్మకాల నిరోధానికి ఉపయోగపడే విధంగా సాంస్కృతిక, మ్యాజిక్ అంశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు యు. వెంకట్రావు,కార్యదర్శివర్గ సభ్యులు బాలు నాయక్, జి. శ్రీనివాసరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మెజీషియన్ రామన్, జి.హరిబాబు, టివి. సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు, మాలిక్, సిహెచ్.లక్ష్మీనారాయణ, జి, ఉమామహేశ్వరి,జగదీశ్వరి, దార్ల శ్రీను,ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లలిత్ సాగర్

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - దొనకొండ

నరసరావు పేటలోని టిడిపి కార్యాలయంలో ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెలుగు యువత నేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి దొనకొండ మండల నాయకుడు కుందుర్తి లక్ష్మణ్, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి, మాజీ సర్పంచి ఆలంపల్లి పిచ్చయ్య, మోడీ ఆంజనేయులు, టిడిపి మండల కార్యదర్శి కొమ్మతోటి సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత : దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల సమయంలో ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని, నామినేటెడ్ పదవులలో వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఎమ్మెల్యే నివాసంలో టిడిపి ఆర్యవైశ్య నాయకులతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలిచిన తరవాత ఆర్యవైశ్యులతో సరిగ్గా కలవలేకపోయాను, అందరితో ఒక్కసారి మాట్లాడాలని కలిశామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్య వైశ్యులకు ఇచ్చిన హామీలు కచ్చితంగా నెరవేరుస్తానని, ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులకు ఇళ్ళ స్థలాలు, రేషన్ కార్డుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఒంగోలు నగర అభివద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఒంగోలు నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో రాబోవు రోజులలో ప్రధాన సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. అందరూ కలసి కట్టుగా ఉండి ఒంగోలు నగర అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం శ్రీ వాసవీ గంగా నిత్యాన్నదాన ట్రస్టు సెక్రటరీ కనమర్లపూడి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రస్టు 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దామచర్ల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆర్యవైశ్య నాయకులు మిరియాల కృష్ణమూర్తి, కొల్లిపల్లి సురేష్, తాతా ప్రసాద్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్ అధ్యక్షుడు తాతా చెంచయ్య గుప్తా, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్య నారాయణ, కొప్పురావూరి సురేష్, పల్లపోతు దుర్గా ప్రసాద్, చీదెళ్ళ ఉమా మహేశ్వరరావు, సుబ్బారావు గుప్తా,పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- నేడు పోరు దీక్ష ను జయప్రదం చేయండి

- ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, వైఎస్ఆర్ ఎస్‌యు, ఎఐవైఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లోఉన్న రూ.3580 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజి యాదవ్, వైఎస్ఆర్ ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి. ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నెలలు గడుస్తున్నా, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను మార్చినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ ఉన్న బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తుందని ధ్వజ మెత్తారు. దీంతో విద్యా సంస్థల యాజ మాన్యాల వద్ద విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడి గురవుతున్నారన్నారు .ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని, ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, యాజమాన్యాల వద్ద 7 లక్షల విద్యార్థులు సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. యాజమాన్యాల వద్ద సర్టిఫికెట్ ఉండడం ఎవరికి ప్రయోజనమని ప్రశ్నించారు. మరో పక్క ప్రభుత్వం యాజమాన్యాల అందరికి పూర్తిగా చెల్లిస్తామని, విద్యార్థులకు అడ్మిషన్స్ సమయాల్లో, పరీక్షల సమయంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పెట్టకూడదు అనే స్పష్టమైన ఆదేశాలు లేవన్నారు. దీంతో విద్యార్థుల వద్ద నుంచి కళాశాలలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు, ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తున్నారు తప్ప, ఇలాంటి చర్యలకు పాల్పడటం లేదని విమర్శించారు. ఉన్నత విద్యారంగానికి సంబంధించి జీవో నంబర్ 77 పై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. కేవలం రీయంబర్స్‌మెంట్ అందకపోవడంతో పది లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమ వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లోని బకాయిలను విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలన్నారు . రెండు నెలల నుంచి వినతి పత్రాలు, నిరసనల రూపంలో విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం కురిసినట్లుగా ప్రవర్తిస్తుందని వాపోయారు. సోమవారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న పోరుదీక్షలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజనసంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పేదలు, సిపిఎం నాయకులు

డొంక భూమిని కాపాడాలని నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక 33వ డివిజన్ కొత్త డొంకలో డొంక భూమి ఆక్రమణకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ శర్మ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్కడ 35 సంవత్సరాల నుంచి ఉన్న నివాస గహాల్లోకి దౌర్జన్యంగా పిల్లర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానికులు ఈనెల 23న గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. సమస్యను 15 రోజుల్లో పరిష్కారం చేయాలని కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి కమిషనర్ చర్యలు తీసుకొని కారణంగా ఆక్రమణదారుడు చంద్రశేఖర్ శర్మ అక్రమ కట్టడాలను దౌర్జన్యంగా కొనసాగిస్తున్నారని వివరించారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి, అక్రమ కట్టడాలను నిలిపేసి స్థానికంగా 35 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేద ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఎస్‌డి.హుస్సేన్, బివి.రావు , స్థానిక శాఖ కార్యదర్శి టి.సురేష్, స్థానికులు జబ్బార్, చిటితోటి దానియేలు ,మద్దిరాల సాంబశివరావు, సన్నబోయిన వీర బ్రహ్మం, రాచూరి మోహన్‌రావు, అట్లూరి మోసే, కొణిజేటి శ్రీనివాసరావు, కొలంబతి సత్యవతి, మోటుపల్లి హైమావతి, కలకవోలు పద్మ, సుకూర్, చేపల శివ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు స్థలాలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా దళితులకు శ్మశాన వాటికలు లేవని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు విమర్శించారు. ఒంగోలులోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడారు. దళితులకు శ్మశాన వాటికల కోసం స్థలాల్ని కొనుగోలు చేసి ఇవ్వాలని ప్రభుత్వం జారీ చేసిన జీవో 1235 పట్ల రాష్ట్రంలోని కలెక్టర్లు కుల వివక్ష పాటిస్తున్నారన్నారు. నాడు టిడిపి ప్రభుత్వం ప్రజల వద్దకు పాలన, జన్మభూమి పేరుతో వంచనకు పాల్పడితే, నేడు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో దళితులను మోసగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం పని చేస్తుందనే భావన ప్రజల్లో కలిగించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తప్ప, ప్రజా సమస్యల్ని పరిష్కరించే చిత్తశుద్ధి అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు లేదన్నారు. అనేక సందర్భాల్లో దళితులు తమకు ప్రత్యేక స్మశాన వాటికలు కావాలని కోరినా రెవెన్యూ అధికారులు స్పందించ లేదన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, నాయకులు కాకుమాను రవి, కసుకుర్తి రాజు, దేవరపల్లి రమణయ్య పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- మండలంలో వెయ్యి ఎకరాల్లో తడిసిన వరి ధాన్యం
- పూర్తిగా నష్టపోయిన వరి రైతులు
- ప్రభుత్వం ధాన్యం కొని ఆదుకోవాలని రైతుల అభ్యర్ధన

ప్రజాశక్తి-దర్శి

ఆరు గాలం కష్టం చేసి పండించిన పంట చేతి కొచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులు పూర్తిగా నష్టపోయారు. మండలంలోని తూర్పు వెంకటాపురంలో ఎర్రగుంట్ల శ్రీను అనే రైతు దర్శి నుండి తూర్పు వెంకటాపురం వెళ్లే రోడ్డులో తడిసిన వరిగడ్డిని ఎండబెట్టుకుంటూ నష్టపోయామని వాపోతున్నారు. తనకు ఉన్న రెండు ఎకరాల భూమిలో వరి నాటి కోసిన సమయంలో వర్షం రావడంతో పూర్తిగా వర్షంలో తడిసి ముద్దయింది. శనివారం ఎండ రావడంతో కొంత కోసిన వరి పంటను ఆదివారం రోడ్డు మీదకు తెచ్చి ఎండబెట్టినట్లు తెలిపారు. ఎకరానికి 40 బస్తాలు అనుకున్న పంట 20 బస్తాలు కూడా దిగుబడి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా ఎకరానికి రూ.30వేల చొప్పున రూ.60వేల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. వరి కోసిన సమయంలో ఏకధాటిగా రెండు రోజులు వర్షం పడటంతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని రైతు తన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుకాలం పండిన పంట వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వెయ్యి ఎకరాలకుపైగా చేతి కొచ్చిన పంట రైతులు నష్టపోయారు. వరి ధాన్యం తడిసిపోవడంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం కోవాలని కోరుతున్నారు. దళారులకు అమ్ముకుంటే తడిసిన ధాన్యం లెక్కలో రూ.వెయ్యి కంటే ఎక్కువ కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్ద ధరకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మామూలుగా 74కేజీలు బస్తా రూ.1300 నుంచి రూ.1400లకు అమ్ముకుంటున్నామని, ఇది కేవలం రూ.వెయ్యి కంటే కొనరని ఎర్రగుంట్ల శ్రీను వాపోతున్నారు. రైతులు అందరూ ఇవే పరిస్థితులు చెప్పుకుంటూ బాధలు వెల్లబుచ్చుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుచున్నారు.



తడిసిన వరిగడ్డిని రోడ్డుమీద ఎండబెట్టుకుంటున్న రైతు ఎర్రగుంట్ల శ్రీను

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా నాయకులు తాండవ రంగారావు

ప్రజాశక్తి - దొనకొండ

పోరాటాలు చేయటం ద్వారానే హక్కులు వస్తాయని, కార్మికులు రక్షణ పొందవచ్చని సిఐటియు జిల్లా నాయకులు తాండవ రంగారావు అన్నారు. దొనకొండలో పంచాయితీ పారిశుధ్య కార్మికులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులకు సీఐటియు అండగా నిలబడుతుందని అన్నారు. కేంద్రంలో మోది ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మిక చట్టాలు రద్దు చేయాలని చూస్తుందని అన్నారు. కనీస వేతన చట్టం ప్రతి ఏడాది జీఓ ఇచ్చి అమలు చేయాల్సి ఉండగా పట్టించుకోవటం లేదని విమర్శించారు. సీఐటియు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యం కాపాడటం కోసం మురికి కూపాలు, దుర్వాసనల మధ్య సేవలిందిస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాల చట్టం ప్రభుత్వం అమలు చేయటం లేదని అన్నారు. నెల నెల వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రక్షణ పరికరాలైన గ్లౌజులు, బూట్లు, సబ్బులు, నూనె అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి లూకయ్య, వైదన ఇశ్రాయేలు, ఎగ్గోని ఒర్సు, అరవ రాణి, కొండా ఏసుదాసు, జమ్మలమూడి యోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు తాండవ రంగారావు

ఫ్రీజర్ బహూకరించిన చప్పిడి రామలింగయ్య

ప్రజాశక్తి - పొదిలి

మానవత సంస్థ నూతన భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం చప్పిడి రామలింగయ్య మానవతా సంస్థకు ఒక ఫ్రీజర్ బాక్స్ వుచితంగా అందించారు. మానవత సంస్థ స్థాపించిన నాటి నుండి నేటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలతో రాష్ట్రంలోనే మంచి పేరు తెచ్చుకుని అత్యున్నత స్థానంలో ఉన్నదని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన సేవా కార్యక్రమాలను విశ్లేషించుకుని రాబోయే నూతన సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలను చర్చించారు. భవాని గ్రూప్స్ అధినేత పేర్ల శ్రీనివాసరావు భోజనాలు ఏర్పాటు చేశారు. మానవత జిల్లా కార్యదర్శి కె యల్లమందారెడ్డి, ఛైర్మెన్ మువ్వల పార్ధసారధి, వైస్ ఛైర్మెన్ షేక్ నూర్జహాన్, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శి బండి అశోక్, ట్రెజరర్ సోమిశెట్టి చిరంజీవి, జాయింట్ సెక్రెటరీ భూమా సుమంత్, డైరెక్టర్లు శ్రావణి వెంకటేశ్వర్లు, గునుపూడి చెంచు సుబ్బారావు, ఎన్నార్రై కాసు వెంకటేశ్వరరెడ్డి, తానికొండ వెంకట్రావు, యక్కలి శేషగిరి, భవాని గ్రూప్స్ పేర్ల శ్రీనివాసరావు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ధర్నాసి రామారావు, అప్పల సత్యం, కరీముల్లా బేగ్, బివి రెడ్డి, బాజీ కరీముల్లా, బెల్లంకొండ విజయలక్ష్మి, వై కిరణ్మయి, వరికూటి శిరీష, జి శ్రీను, వరికుంట్ల వినోద్ రాజ్, మామిడి వెంకటేశ్వర్లు, బొగ్గవరపు శ్రీనివాస్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.




మానవత సంస్థకు ఫ్రీజర్ బహూకరిస్తున్న చప్పిడి రామలింగయ్య

ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా జవ్వాజి

ప్రజాశక్తి - కురిచేడు

ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షునిగా ప్రముఖ వస్త్ర వ్యాపారి జవ్వాజి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య జిల్లా ఎన్నికల నిర్వహకులు మువ్వల శ్రీనివాసులు, యండమూరి రాములు కురిచేడుకు వచ్చి ఆర్య వైశ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఎవ్వరు నామినేషన్ వేయకపోవడంతో జవ్వాది సత్యనారాయణ వేసిన నామినేషన్ ఏకగ్రీవం కావడంతో ఆయనను ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షునిగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో కొత్త అయ్యప్ప శెట్టి, మేడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

అమిత్‌షా వైఖరిని వ్యతిరేకిస్తూ నేడు వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి -కనిగిరి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన అవమానకర వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి నిరసన ర్యాలీ జరుగుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిసి కేశవరావు, సిపిఐ మండల కార్యదర్శి జిపి రామారావు తెలిపారు. ర్యాలీ అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు.



ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

వధూవరులకు బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రాచపూడి పేతురు, రోతమ్మ కుమార్తె రజిత, హొసన్న వివాహ రిసెప్షన్‌కు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరై వధూ-వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బి రామారావు, ఎంపిటిసి సుబ్బారెడ్డి, నాయకులు రాచపూడి యోహాను, మల్లికార్జురెడ్డి తదితరులు పాల్గొన్నారు.




నారాయణస్వామిని దర్శనం చేసుకున్న మాధవ్ దంపతులు

నారాయణస్వామి ఆలయ సందర్శనం

ప్రజాశక్తి - సిఎస్ పురం

జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి మహా నైవేద్యం జరిగింది. గోపూజ, స్వామివారి పల్లకి సేవ వైభవంగా జరిగింది. నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవ్, ప్రసాద్, రమణమ్మ దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. తన స్వంత నిధులతో ఉచిత ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. ఆలయ వ్యవస్థాపన చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఇట నరసింహాబాబు, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.



దర్శించుకున్న తహశీల్దారు శ్రీకాంత్ దంపతులు

తాళ్ళూరు : మండలంలోని తూర్పు గంగవరం సమీపాన వెలసిన గుంటి గంగమ్మ అమ్మవారి పూజా కార్యక్రమాల్లో ముండ్లమూరు ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీకాంత్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

31న పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - పీసీపల్లి

ఈనెల 31న మంగళవారం రోజునే డిసెంబర్ నెల పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ ఓ ప్రభాకరశర్మ తెలిపారు. ఒకటోతేదీ నూతన సంవత్సరం వేడుకలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండి అందజేస్తారని తెలిపారు. మండలంలో 4747 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ.2.01కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావున 31న పెన్షన్ లబ్దిదారులు ఇళ్లవద్దనే అందుబాటులో ఉండి పెన్సన్ తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

యూటీఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి యుటిఎఫ్ ఉపాధ్యక్షులు బండి బిక్షాలు బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగంలో పరిష్కరించాల్సిన పలు సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, గత కొంతకాలంగా ఉద్యోగ, ఉపాద్యాయలకు బకాయిలుగా ఉన్న డీఏ, సరండర్ లీవ్ వంటి ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసే లోపు ముందుగా 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కరువుభత్యం, మధ్యంతర భృతి, పీఆర్సీ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాకినాడలో జనవరి 5 నుంచి 8 వరకు జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను, విద్యా వైజ్ఞానిక మహా సభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 31న జిల్లాలో అద్దంకి, మార్టూరు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, రేపల్లె, ప్రాంతాల్లో తిరిగే జాతాలో భాగంగా యూటీఎఫ్ పతాకావిష్కరణలను , బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బిక్షాలు బాబు మాట్లాడుతూ ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాద్యాయ, విద్యార్థి నిష్పత్తిని ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో ఉన్న దాన్ని తగ్గించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, హిందీ, ఫిజికల్ సైన్స్, రెండవ పోస్టు మంజూరు విషయంలో ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యం మేరకు అమలు జరపాలని అన్నారు. ఈ సమావేశంలో తొలుత పంగులూరు మండల అధ్యక్షులు టి.వి.నరసింహారావు మృతికి సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు ఎస్.పాపారావు, ఎం.వెంకటేశ్వరరెడ్డి, యు.చెంచయ్య, సుబ్రహ్మణ్యం, సురేష్, సురేష్, రామాంజనేయులు, కోటేశ్వరరావు, బి.వినోద్ బాబు, వి.విజయలక్ష్మి, ఆర్.పద్మావతి, కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరెడ్డి, బాప్యయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు పి.సీతారామరాజు, మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడుగుల శ్రీనివాసరావు

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్

ప్రజాశక్తి-బాపట్ల

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, తోకలవానిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఎంపీడీవోపై జరిగిన దాడిని కృష్ణమోహన్ ఆదివారం ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో దళితుడైన జవహర్ బాబుపై దాడి చేసిన సుదర్శన్ రెడ్డి, గడ్డం చంద్రప్రకాష్ రెడ్డి, జెసిపి రమణారెడ్డి, గరుగుపల్లి రామాజున్ రెడ్డి, వెంకటరెడ్డి, బానుమూర్తిరెడ్డి, ధర్మారెడ్డి, ప్రభాకర్ లపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. గాలివీడు మండల అభివృద్ధి అధికారి జవహర్ బాబు విధి నిర్వహణలో ఉండగా కార్యాలయానికి తాళాలు వేయడమే గాక దాడి చేసి గాయపరచడం అత్యంత పాశవిక చర్య అన్నారు. అధికారులతో ఇబ్బందులు ఉంటే పై అధికారులకు పిర్యాదు చేయాలే కానీ దాడులు చెయ్యడం సిగ్గు చేటన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించడం బాధిత ఎంపీడీవోను పరామర్శించడం మంచి పరిణామమే అయినప్పటికీ, కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత గిరిజనులపై దాడులు వీపరీతంగా పెరిగాయని వీటిపై స్పందించి సమీక్షించాలని దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రం ముఖ్యమంత్రి స్థాయిలో దళిత అధికారులు, దళితులు, గిరిజనులపై దాడులు జరగకుండా ప్రజలకు భరోసా కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు.

సరస్వతమ్మ సేవలు వెలకట్టలేనివి

ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి సాయిబాబు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ప్రాంతంలో స్త్రీ విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు వెలగపూడి సరస్వతమ్మ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి.సి. సాయిబాబు అన్నారు. ఆదివారం సరస్వతమ్మ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ 1915లో ఆమె ప్రారంభించిన యువతి విద్యా నిలయం నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చెందిందన్నారు. దీని అభివృద్ధికి సరస్వతమ్మ తన జీవిత సర్వస్వాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. పట్టణం నడిబొడ్డున అర ఎకరం స్థలాన్ని ఆ విద్యా సంస్థకు విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. స్త్రీ అభ్యుదయానికి ఆమె చేసిన కృషి అనన్య సామాన్యమైనదన్నారు. ఆ విద్యాసంస్థల్లో చదివిన మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళాభివృద్ధికై పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎమ్‌జి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె.శివ పార్వతి, జి.గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-బాపట్ల

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.25 వేల కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌టిఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలో ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా శాఖ 78వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో సుధీర్ బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్మును ఖర్చుపెట్టేసి మొండి చేయి చూపించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికీ ఆరు నెలలు అయినప్పటికీ పెండింగ్ బకాయిల చెల్లింపుపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగులో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 117 జీవో రద్దు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్. రామచంద్రయ్య, జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ పీవీ నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు చందా నరసింహారావు, గుగ్గిలం ఉదయ శంకర్, రాష్ట్ర బాధ్యులు వంకా ప్రభాకర్ రావు, కేఏకె జిలాని, జిల్లా ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, అదనపు ప్రధాన కార్యదర్శి నూర్ భాషా సుభాని, సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీధర్, జి.నాంచారయ్య, పీలా శివవాంజనేయులు, శ్రీనివాసరావు, టి.శివయ్య, నారాయణ, ఈమని సాంబశివరావు, యేసు రత్నం, రమణారావు, గుడారంకయ్య, నానిబాబు పాల్గొన్నారు.

నడింపల్లిలో రీసర్వేపై అవగాహనా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-చెరుకుపల్లి

భూముల రీసర్వే ద్వారా ఎటువంటి తప్పులు లేని, వివాదాలు లేకుండా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ సిహెచ్ పద్మావతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని చెరుకుపల్లి మండలంలో నడింపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు తహశీల్దార్ సిహెచ్ పద్మావతి పాల్గొని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భూ సర్వే కార్యక్రమంలో తమ పొలాలకు హద్దులను తెలుసుకోవచ్చునన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుబ్బారావు, మాజీ సర్పంచ్ వసుధ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోనిక, కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-బాపట్ల

మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్ల పట్ల జాగ్రత్తలు తీసుకొని ప్రతి ఒక్కరు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు బి.శరత్ బోస్ అన్నారు. ఆదివారం మహిళా సమాఖ్య, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా పట్టణంలో ఎకో హౌస్ వైద్యశాలలో ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరం, మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. స్త్రీల ప్రత్యేకమైన సమస్యలతో బాటు, అధిక బరువు, మెటాబాలిక్ జబ్బులు, షుగర్, రక్త పోటు వంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. ఏరియా వైద్యశాల సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు మీనా, టి.వి. కోటేశ్వరరావు,మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కోలా పద్మజ, కార్యదర్శి బొమ్మిశెట్టి అనంత కుమారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు

సంధి పాగు నాగయ్య, నవీనమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఆదివారం కొండ మంజులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైటల్ హెల్త్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 150 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొండమంజులూరు గ్రామ సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్ పాల్గొన్నారు. శిబిరానికి హాజరైన 150 మందిలో 25 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని మ్యాక్సీ విజన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. మిగతా వారికి ఐ డ్రాప్స్ మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైటల్ హెల్త్ కేర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులను పలువురు అభినందించారు.



సుబ్బరామయ్యను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మంచి అలవాట్లతో ఆరోగ్యం

ప్రజాశక్తి-వేటపాలెం

ఆరోగ్యకరమైన జీవితానిక్ మంచి అలవాట్లు దోహదపడతాయని విశ్రాంత వ్యవసాయశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ప్రోబస్ క్లబ్ ఉపాధ్యక్షులు బుద్ధి సుబ్బరామయ్య తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం ప్రోబస్ క్లబ్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరామయ్య 'నా కవితల సంకలనం' అనే అంశంలో ఆయన రచించిన కవితలు ఆలపించారు. ఇందులో తెలుగు అక్షరమాల, జీవి – జీవితం, నడక – నడత, మద్యం, జవాన్, కిసాన్ తదితర విషయాలపై ఆయన రాసిన స్వీయ కవితలు సభికులకు వినిపించారు. అనంతరం ప్రోబస్ క్లబ్ ప్రతినిధులు గౌరవ సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆవుల పున్నయ్య, కార్యదర్శి బీరక సుబ్రహ్మణ్యం, కోశాధికారి బొడ్డు కోటేశ్వరరావు, వలేటి సుబ్బారావు, నాయని సత్యనారాయణ, కర్ల సుబ్బారావు, ఎస్ఎం. షరీఫ్, ఉమ్మిటి పమిడయ్య, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ఛైర్మన్ కె.శరత్ బాబు

తొలగించిన మగ ఆరోగ్య కార్యకర్తలను

విధుల్లోకి తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

తొలగించిన కాంట్రాక్టు మగ ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలని, సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నండూరి ప్రసాదరావు భవనంలోఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేవం నిర్వహించారు. తొలగించిన మగ ఆరోగ్య కార్యకర్తలను విధులలోకి తీసుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సమావేశానికి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.సురేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎపి ఎన్‌జిఒ సంఘ జిల్లా అధ్యక్షులు, జెఎసి ఛైర్మన్ కె.శరత్ బాబు మాట్లాడుతూ మగ ఆరోగ్య కార్యకర్తలను వెంటనే విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఉద్యోగులు ఐక్య పోరాలకు తమ మద్దతు ప్రకటించారు. ఎపి హెల్త్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు టి.రమణారెడ్డి మాట్లాడుతూ 22 సంవత్సరాల నుంచి వైద్య ఆరోగ్య శాఖలో సేవలు అందిస్తున్నామని, కరోనా సమయంలో, మలేరియా, డెంగీ, అతిసార లాంటి అంటు వ్యాధులను అరికట్టడంలో అంకిత భావంతో పనిచేస్తున్నామన్నారు. మగ ఆరోగ్య కార్యకర్తలను పర్మినెంట్ చెయ్యక పోగా తొలగించడం అన్యాయమన్నారు. వారికి విధుల్లోకి తీసుకొని కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ ను ముఖ్య మంత్రి చొరవ తీసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ వయస్సులో ఉన్నంతకాలం కాంట్రాక్టు కార్మికులతో సేవలు చేయించుకుని వయస్సు మళ్ళిన సమయంలో వారిని తొలగించడం అన్యాయమన్నారు. వారిని విధులలోకి తీసుకునే వరకూ మద్దతుగా ఉంటామని ప్రకటించారు. ఈ సమావేశంలో యుఎంహెచ్ఇ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్‌బాబు, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాసరావు, తెలుగునాడు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రవి, ఆలిఇండియా రవాణా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మసూద్ ఆలి, అంగనవాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, 108 ఉద్యోగుల సంఘం నాయకులు భాస్కర్, ఆర్‌టిసి స్టాఫ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మల్లికార్జునరావు, మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ రాష్ర నాయకులు చిరంజీవి, జిఎంపిఎస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరావు, రజక వత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాలకొండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-చినగంజాం

క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా సండే స్కూల్ విద్యార్థులు పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు డిప్యూటీ తహశీల్దారు మేడికొండ స్రవంతి ఆర్థిక సాయంతో బహుమతులు అందజేశారు. తహశీల్దారు స్రవంతి తల్లి రూతుమ్మ చేతుల మీదుగా విజేతలకు ఆదివారం బహమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజేతలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద

నిరసనను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని కోరుతూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు కోరారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం నాయకుడు పూసపాటి వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్పొరేట్ శక్తులకు సంపద మొత్తాన్ని దోచిపెట్టడానికి, తమ అనుకూలమైన విధానాలు అమలు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

చేయడానికి, ఆర్ఎస్ఎస్ జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను హరించివేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలపై మరింత భారాలు పడనున్నాయని, వాటిని తిప్పి కొట్టాల్సిన అవసర ముందన్నారు. లౌకిక విలువలు, ప్రజాస్వామ్య విలువలు కలిగిన రాజ్యాంగాన్ని పాతరపెట్టి, మనువాదాన్ని ముందుకు తీసుకురావడానికి ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, సిపిఎం మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, టి. రామారావు, కె. చిన్నపరెడ్డి, పి. సురేష్, సిహెచ్.కొండయ్య, నుగ్గు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘అమృత్‌సర్ 2.0’లో చెరువుల అభివృద్ధి

- ఉపాధి కూలీలకు వేతనాలు అందించేందుకు కృషి
- ఉద్యాన తోటల పెంపకానికి చర్యలు
- పూర్తి స్థాయిలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్
- జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ జి.జోసఫ్ కుమార్



ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా ‘అమృత్‌సర్ 2.0’లో చెరువులను అభివృద్ధి కృషి చేస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ తెలిపారు. ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఉద్యానతోట పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చి లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. రైతుల పొలాలకు ఫారం పాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఇళ్ళలోని వ్యర్ధనీటిని భూమిలోకి ఇంకింప చేయటానికి చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పూర్తి స్థాయిలో నిర్మిస్తున్నామన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రజాశక్తి వివరించారు. ఆ విశేషాలన్ని ఆయన మాటలల్లోనే...

జిల్లాలో ఉపాధి చట్టాన్ని సమగ్రంగా అమలు చేస్తున్నాం. పథకంలో భాగంగా అమృత్‌సర్ 2.0లో గ్రామాలలోని చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. జిల్లాలో 350 చెరువులను గుర్తించి అభివృద్ధి చేస్తున్నాం. చెరువులలో పూడిక తీత, కట్టల బలోపేతం, జంగిల్ క్లియరెన్స్, వాకింగ్ ట్రాక్ ప్లాంటేషన్ చేపడు తున్నాం. ఆ గ్రామస్తులు నిర్ణయించిన ప్రకారం చెరువును అభివృద్ధి చేస్తాం. వీటిని గ్రామ పంచాయతీ నిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఐల సహకారంతో చేపతున్నారు.

కూలీలకు 206 కోట్ల వేతనాలు చెల్లింపు

ఉపాధి హామీ చట్టం ద్వారా జిల్లాలో 4లక్షల 36 వేల కుటుంబాలకు జాబ్ కార్డులు మంజూరు చేశాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.56 కోట్ల పనిదినాలు లక్ష్యంగా. ఇప్పటి వరకు 1.17 కోట్ల పనిదినాలు కల్పించాం. కూలీలకు వేతనాల రూపంలో రూ.206.81 కోట్లు ఖర్చు చేశాం. సుమారు 2.84 లక్షల కుటుంబాలకు చెందిన 4.83 లక్షల మంది వేతనదారులకు పనులు కల్పించాం. ఇప్పటి వరకు 4,715 కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు కల్పించాం. గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు రూ.105.36 కోట్లు విలువైన మెటీరియల్ చెల్లింపులు జరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.352.17 కోట్లు ఖర్చు చేశాం.

ఉద్యాన తోటల పెంపకానికి ప్రాధాన్యత

2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ప్రకాశం జిలాకు మొత్తం 5000 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించారు. పండ్ల తోటల వేసుకున్న రైతులకు పూర్తి సబ్సిడీ, 3 సంవత్సరాల పాటు సంరక్షణ యాజ మాన్యంలో అమలు చేస్తున్నాం. 2017 మంది రైతులకు సంబంధించి 3584 ఎకరాలు అంచనాలు తయారుచేశాం. 1802 మంది రైతులకు సంబంధించి 3268 ఎకరాలకు కలెక్టర్ నుంచి పరిపాలన ఆమోదం పొందాం. ఇప్పటి వరకు 2186.00 ఎకరాలు ఫిట్టింగ్ పూర్తిచేసి, 2138.00 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయింది.

ఫారం పాండ్స్ నిర్మాణం

2024 -25 ఆర్థిక సంవత్సరంలో రైతుల పొలాలలో ఫారం పాండ్స్ నిర్మాణానికి 7100 లక్ష్యం నిర్ధేశించారు. ఇప్పటి వరకు 4035 పనులకు పరిపాలనా ఆమోదం పొందాం. 1149 పనులు పురోగతిలో ఉన్నాయి. 14 పనులు పూర్తయ్యాయి.

గోకులాల నిర్మాణం

2024-25 ఆర్థిక సంవత్సరంలో 1075 క్యాటిల్ షెడ్స్ లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 1094 పనులకు సంబందించి పరిపాలన ఆమోదం తీసుకున్నాం. ఇందులో భాగంగా 1024 పనులు ప్రతిపాదించారు. జిల్లాలోని వివిధ గ్రామాలలో పూర్తి స్థాయిలో 241 గోకులాల షెడ్ల నిర్మాణం పూర్తి చేస్తాం

పూర్తి స్థాయిలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్

జిల్లాలోని (మున్సిపాలిటీలు) మినహా అన్ని మండలాలలోని ప్రభుత్వ కార్యాలయ భవనాలు, పాఠశాలల భవనాలపై పడిన వర్షపు నీటిని ఎక్కడ పడితే అక్కడ పట్టుకునే వ్యవస్థ. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్. హార్వెస్టింగ్లో, పైకప్పు పరివాహక ప్రాంతంగా మారుతోంది. ప్రభుత్వ భవనం పై కప్పు వర్షపు నీరును నేరుగా రీఛార్జ్ సిస్టమ్ మళ్లించబడుతుంది. జిల్లాలో ఇప్పటి వరకూ 234 పనులకు 138 రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రెక్సర్ పనులు పూర్తి స్థాయిలో నిర్మించాం.

ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు

ఇంటి లోని వ్యర్థ నీరును భూమిలోకి ఇంకింపజేయటం లక్ష్యం. ఇంకుడు గుంత నిర్మాణంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. భూగర్భ జలాలు కలుపితం కాకుండా ఉంటాయి జిల్లాలో 35000 ఇంకుడు గుంతలు నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించి ఇప్పటి వరకు 9893 ఇంకుడు గుంతలకు పరిపాలన ఆమోదం తీసకున్నాం. మిగలిన ఇంకుడు గుంతలకు కూడా పరిపాలన ఆమోదం త్వరలో తీసుకొని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ ఇంకుడు గుంతలు నిర్మాణం చేపడతాం.